క్లుప్తంగా

దుకాణాలకు హద్దుల నిర్ణయం



హద్దులు వెల్లడిస్తున్న ఎంపీడీవో శ్రీవాణి

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం మెయిన్‌రోడ్డుకు ఇరువైపుల ఉన్న దుకాణాలకు గురువారం ఎంపీడీవో శ్రీవాణి హద్దులు నిర్ణయించారు. కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న దుకాణాదారులు తాత్కాలికంగా రేకుల వేసి రహదారిపైకి వస్తుండటంతో ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బంది కలగడంతోపాటు ఇటీవల ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో స్పందించిన అధికారులు రహదారి మధ్య నుంచి 50 మీటర్ల దూరంలో దుకాణాలు ఉండాలని సూచించారు. నింబంధనలకు విరుద్ధంగా రేకుల వేసుకున్న దుకాణాదారులకు 24 గంటల గడువు ఇచ్చారు. సమయం దాటితే జేసీబీతో కూల్చివేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీఓ వసీరుద్దీన్, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్‌రెడ్డికి ఎంపీ టికెట్ కేటాయించాలి

వీణవంక: కరీంనగర్ పార్లమెంట్ టికెట్ అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డికి కేటాయించాలని మండలంలోని వల్భాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు శశికాంత్‌రెడ్డి ప్రకటనలో కోరారు. పార్టీ బలోపేతానికి ప్రవీణ్‌రెడ్డి ఎనలేని కృషి చేశారని, పార్టీ పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను గుర్తించాలని, ఎవరు పడితే వారు పార్టీలోకి వస్తే తీసుకోవద్దని, గత పదేళ్లుగా పార్టీ కోసం కార్యకర్తలు ఎంతో పాటు పడ్డారని, ఇప్పుడు ఇతర పార్టీల నుంచి చేర్చుకోవడం వల్ల నిజమైన కార్యకర్తలు ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడతామని ప్రతి కార్యకర్త కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు.

అధిక ఫీజుల వసూలుపై చర్యలు తీసుకోవాలి

జమ్మికుంట: పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలు సీబీఎస్ఈ, ఐఐటీ ఓరియేంటెడ్ అంటూ అడ్మిషన్లు, అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త గట్టు సాయిరాం డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో మాట్లాడారు. పదో తరగతి ఫలితాలు వెలువడక ముందే అడ్మిషన్ల ప్రారంభిస్తున్నాయని, పిల్లల భవిష్యత్తు కోసం ఎన్నో కలలు కన్న అమాయక తల్లిదండ్రులకు నాణ్యమైన విద్య అందిస్తామని వేల రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. కలెక్టర్, విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

బెంచీలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వాకింగ్ ట్రాక్ పక్కనే వాహనాలు నడిపి, గుర్తు తెలియని వ్యక్తులు బెంచీలు ధ్వంసం చేశారని, వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తుమ్మేటి సమ్మిరెడ్డి గురువారం డిమాండ్ చేశారు. సాయంత్రం వేళ కళాశాల మైదానంలో మందుబాబులు విచ్చల విడిగా మద్యం సేవిస్తున్నారని, ప్రభుత్వ బాలికల హాస్టల్ ఉంది కావున పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని కోరారు. మేరకు టౌన్ సీఐకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న కార్యదర్శి వంశీ

శంకరపట్నం: మండలంలోని మక్త గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను గురువారం గ్రామ కార్యదర్శి వంశీ పంపిణీ చేశారు. మండుటెండంలో ఉపాధి పనులు అనే కథనం సాక్షి దినపత్రికలో ప్రచురితం కావడంతో స్పందించిన కార్యదర్శి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందించగా కూలీలు కొంత ఉపశమనం పొందారు.

లాడ్జి ప్రారంభం



చొప్పదండి: చొప్పదండి పట్టణంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన లాడ్జిని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతిగౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలు

ప్రశాంతంగా జరిగేలా..

- పోలీసుల ముందస్తు చర్యలు
- నిరంతరం తనిఖీలు, సమస్యాత్మక గ్రామాలపై నిఘా
- ప్రజలతో అవగాహన సమావేశాలు
- పాత నేరస్తులు, బెల్ట్‌షాపు నిర్వాహకుల బైండోవర్
- గ్రామాల్లో కేంద్రబలగాలతో పోలీసుల కవాతు



హుజూరాబాద్‌లో కేంద్ర బలగాలతో కవాతు చేస్తున్న ఏసీపీ శ్రీనివాస్ జీ, టౌన్ సీఐ రమేశ్ (ఫైల్)

హుజూరాబాద్: పార్లమెంట్ ఎన్నికలకు నెల రోజుల గడువు కూడా లేదు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో హుజూరాబాద్ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా పోలీసులు ఇప్పటికే ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లోని పాత నేరస్తులను గుర్తించి వారి కదలికలపై నిఘా పెంచారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు ఇప్పటికే గ్రామాల్లోని బెల్ట్ షాపుల నిర్వాహకులను బైండోవర్ చేయగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అనుమానితులను బైండోవర్ చేశారు. ప్రధానంగా ఎంపీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేలా, ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలని గ్రామాల్లో అవగాహన సమావేశాలు నిర్వహిస్తూ ఓటర్లను చైతన్య పరుస్తున్నారు. నిరంతరం ఆయా మండలాల్లోని ప్రధాన రహదారులపై ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా మద్యం, నగదు తరలించే అవకాశాలు ఉండటంతో రాత్రి వేళల్లో పోలీసులు కేంద్ర బలగాలతో గస్తీ నిర్వహిస్తున్నారు.

20 సమస్యాత్మక గ్రామాల గుర్తింపు

పోలీసులు నియోజకవర్గంలో 20 సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు. హుజూరాబాద్ మండలం చెల్పూర్, పోతిరెడ్డిపేట, హుజూరాబాద్, పెద్దపాపయ్యపల్లి, కందుగుల, కాట్రపల్లి, జమ్మికుంట మండలం విలాసాగర్, తనుగుల, పాపక్కపల్లి, వావిలాల, కోరపల్లి, మోత్కులగూడెం, వీణవంక మండలం చల్లూర్, వీణవంక, ఘన్ముకుల, ఎల్బాక, వల్బాపూర్, ఇల్లందకుంట మండలం సిరిసేడు, మల్యాల, ఇల్లందకుంట గ్రామాల్లో ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు కృషి చేస్తునానరు. ఇప్పటికే నియోజకవర్గ కేంద్రానికి కేంద్ర బలగాలు చేరుకున్నాయి. అలాగే కేంద్ర పోలీసు బలగాలతో ఆయా గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహిస్తున్నారు.

పోలింగ్ శాతం పెరిగేలా అవగాహన

ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలని పోలింగ్ శాతం పెరిగేందుకు పోలీసులు ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తూ ఓటర్లకు చైతన్యం కలిగిస్తున్నారు. శాంతిభద్రతలను విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలను వివరిస్తున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని రాజకీయ పార్టీల నేతలతో పాటు ఓటర్లను కోరుతున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఇప్పటికే నియోజకవర్గంలో దాదాపు 320 మందిని బైండోవర్ చేశారు. 54 వివిధ రకాల కేసులను నమోదు చేశారు. జిల్లాలోనే వీణవంక మండలం సమస్యాత్మక మండలం కావడంతో మండల వ్యాప్తంగా 38 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిబంధనల ప్రకారంగా తనిఖీలు చేస్తున్నాం. ఇప్పటికే సమస్యాత్మక గ్రామాలను గుర్తించి పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని కోరాం. పలు గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాలతో కావాతు నిర్వహించాం. ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటుహక్కును వినియోగించుకోవాలని అవగాహన కల్పించాం. ఎన్నికలకు అందరూ సహకరించాలి.

– శ్రీనివాస్ జీ, ఏసీపీ, హుజూరాబాద్

నేడు విద్యుత్ సరఫరా బంద్

మానకొండూర్: మండలంలోని చెంజర్ల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చెంజర్ల, ఈదులగట్టెపల్లి, పెద్దూర్‌పల్లి, ఖాదర్‌గూడెం గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నామని ఏఈ రమేశ్ తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరాఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న కొంరయ్య

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ గ్రామానికి చెందిన ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాంబారి కొంరయ్య రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలోని కృషిభవన్‌లో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపెల్లి బాపయ్య సాంబారి కొంరయ్యను రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. అనంతరం నియామక పపత్రాన్ని అందించారు. ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కొంరయ్య కృతజ్ఞతలు తెలిపారు.

పదేళ్ల మోసాలను వివరించాలి

- ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం
- మంత్రి పొన్నం ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు

హుజూరాబాద్/కరీంనగర్ కార్పొరేషన్: పార్లమెంట్ ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గంలోని ప్రతి బూత్‌లో కాంగ్రెస్‌కు మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు, నాయకులు సమష్టితో కృషి చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం హుజూరాబాద్‌లోని వెంకటసాయి గార్డెన్స్‌లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వొడితెల ప్రణవ్‌బాబు అధ్యక్షతన ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు చేసిన మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. రూ.ఏడులక్షల కోట్లు అప్పు చేసిన కేసీఆర్, బీఆర్ఎస్ కథ ముగిసిందన్నారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ప్రస్తుత ఎంపీ బండి సంజయ్‌లు హుజూరాబాద్‌కు ఏం చేశారో చెప్పి ఓట్లు అడగాలన్నారు. బండి సంజయ్ రాముడి ఫొటోతో ఓట్లు అడుగుతున్నాడు ఇల్లందకుంట రామాలయాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేదో చెప్పాలన్నారు. ఎంపీగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి పనులను మంత్రి పొన్నం వివరించారు. ఆర్థిక ఇబ్బందులున్నా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, వానాకాలం నుంచి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు కొండూరి సత్యనారాణగౌడ్, ఆరెపల్లి మోహన్, కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, నాయకులు వెలిచాల రాజేందర్‌రావు, కృష్ణారెడ్డి, తుమ్మేటి సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

ప్రతీ పోలింగ్ బూత్‌లో మెజార్టీ రావాలి

ప్రతీ పోలింగ్ బూత్‌లో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ రావాలని, ఆ దిశగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తిమ్మాపూర్ మండలం అల్గునూరులోని ఏఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మానకొండూరు అసెంబ్లీ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

వేదికపై వెలిచాల

కరీంనగర్ ఎంపీ అభ్యర్థిత్వం ఖరారైందనే ప్రచారం నేపథ్యంలో వెలిచాల రాజేందర్‌రావు ఈ వేదికపై కనిపించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ అభ్యర్థిని ఇంకా అధికారికంగా ప్రకటించలేదని, తన పేరును పరిశీలిస్తున్నారన్నారు. ప్రవీణ్‌రెడ్డి తనకు మంచి మిత్రుడని, తీన్మార్ మల్లన్న బీసీ బిడ్డ అని, వీరిరువురు కూడా టికెట్‌కు అర్హులేనన్నారు. పార్టీ టికెట్ ఎవరికి వచ్చినా కలిసికట్టుగా పనిచేయాలన్నారు.

పార్టీ నాయకుడిని తోసేసిన 'కవ్వంపల్లి'

సమావేశంలో ఓ నాయకుడిని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తోసివేయడం వివాదంగా మారింది. లక్ష్మీపూర్‌కు సంబంధించి ఎల్‌వోసీ జారీ విషయంలో మంత్రికి చెప్పుకునేందుకు ఎడ్ల భద్రయ్య వేదిక వద్దకు వచ్చారు. అతడితో మాట్లాడుతూనే అసహనానికి గురైన కవ్వంపల్లి వేదిక మీది నుంచి దిగి భద్రయ్యను తోసివేశారు. దీంతో భద్రయ్యతో పాటు వెంట వచ్చిన కార్యకర్తలు కవ్వంపల్లి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు పొన్నం సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

'మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది'

చిగురుమామిడి: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారంటీల్లో కనీసం మూడింటిని కూడా నెరవేర్చలేకపోయిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య విమర్శించారు. చిగురుమామిడిలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం మరిచి గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను కావాలని వేలెత్తిచూపుతోందన్నారు. రైతులకు గత సీజన్‌లో ఇవ్వాల్సిన బోనస్ డబ్బులను ఈ సీజన్‌లో కూడా ఇవ్వలేదన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీపై ప్రకటన చేయడంలేదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్తారని, ఏ గ్రామంలో చూసినా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు ఆదరణ లభిస్తోందన్నారు.

ఉపాధి పనులకు అధిక సంఖ్యలో హాజరవుతున్న కూలీలు



బొమ్మనపల్లిలో రోడ్డుపనులు చేస్తున్న కూలీలు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో జాతీయ ఉపాధిహామీ పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. బొమ్మనపల్లి–పెర్కపల్లి గ్రామాల మధ్య రోడ్ పనులకు గురువారం 210 మంది కూలీలు హాజరయ్యారు. గ్రామ ప్రత్యేకాధికారి వినయ్‌సాయి, పంచాయతీకార్యదర్శి రమణారెడ్డి రోడ్ పనులను పరిశీలించారు. కూలీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలసుకున్నారు. ఎండలు తీవ్రత అధికంగా ఉన్నందున ఉదయమే పనులకు రావాలని, పెద్ద గ్రామం అయినందున కూలీల సంఖ్య పెంచాలని గ్రామ ప్రత్యేకాధికారి వినయ్‌సాయి సూచించారు. కాగా కొలతల ప్రకారం పనులు చేసే కూలీలకు ప్రభుత్వం ప్రకటించిన రేటు చెల్లిస్తామన్నారు. మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వెంట ఫీల్డ్ అసిస్టెంట్ టి. సత్యం, తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



ఫైర్ కంట్రోల్ పరికరాల పనితీరును వివరిస్తున్న ఫైర్ ఆఫీసర్లు

మానకొండూర్: విద్యుత్, గ్యాస్‌తో ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలని మానకొండూర్ ఫైర్ ఆఫీసర్ భూదయ్య ప్రజలకు, రైస్‌మిల్లులు, పెట్రోలు బంకులు, గ్యాస్ గోదాంలో పనిచేసే సిబ్బందికి సూచించారు. ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదాలు సంభవిస్తే అప్రమత్తంగా ఉండాలని, మంటలను అదుపులోకి తీసుకువచ్చే ఫైర్‌సేఫ్టీ పరికరాలను వినియోగించాలని వాటి పనితీరును వివరించారు. కార్యక్రమంలో ధర్మ, వినోద్‌కుమార్, బి.సతీష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సాయికిరణ్‌ను సన్మానించిన టీచర్లు, నాయకులు





సాయికిరణ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు, వెలిచాల పాఠశాల ఉపాధ్యాయులు

రామడుగు: సివిల్స్‌లో 27వ ర్యాంక్ సాధించిన మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన నందాల సాయికిరణ్‌ను గురువారం బీజేపీ మండల అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్‌శ్రావణ్, నాయకులు శ్రీనివాస్, నర్సింగం, వీర్ల రవీందర్‌రావు, నితీశ్ పాల్గొన్నారు. అనంతరం వెలిచాల జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు హెచ్ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ నాయకుల ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు



చిగురుమామిడి: సుందరగిరిలో..

రామడుగు: మండలంలోని రుద్రారం గ్రామంలో గురువారం బీజేపీ నాయకులు కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్‌ను రెండోసారి గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, కరీంనగర్‌లో బండి సంజయ్ చేసిన అభివృద్ధి పనుల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కట్ట రవీందర్, నరేంద్రచారి, సుంకె దేవానంద్, ఆంజనేయులు చారి, పురుషోత్తం చారి, నాగరాజు, మహేశ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో దోపిడీ

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాల్లో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో తాలు, తరుగు పేరుతో దోపిడీ జరుగుతోందని, రైతులను ముంచుతున్నారని, పాత పద్ధతిలోనే తూకం వేస్తున్నారని బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు పైడిపెల్లి శ్రీనివాస్ ఆరోపించారు. గురువారం బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులతో కలిసి సుందరగిరిలో ఇంటింటికీ బీజేపీలో పాల్గొన్నారు. ప్రతి బస్తాకు రెండు కిలోల పైచిలుకు ధాన్యం తూకం వేస్తున్నారని పలువురు రైతులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దోపిడీ చేస్తుందని, అధికారులు కల్లాల వద్దకు రావడంలేదని, ఈ సీజన్ నుంచే రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా రెండోసారి బండి సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు అచ్చ రవీందర్, బూత్ అధ్యక్షులు తులాయిల వెంకటేశ్వర్లు, కాశవేని రమేశ్, పెసరి పర్శరాములు, దొంత కర్ణాకర్, పొన్నం శ్రీకాంత్, గందె కుమార్, దుర్గం మహేశ్ పలువురు ఉన్నారు.

నేషనల్ హైవే బాధితులకు న్యాయం చేయండి



మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

మానకొండూర్: నేషనల్ హైవే విస్తరణతో భూములు కోల్పోతున్న మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామస్తులకు బాధితులకు న్యాయం చేయాలని కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. గురువారం గట్టుదుద్దెనపల్లి గ్రామం మీదుగా వెళ్తున్న ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. నేషనల్ హైవే గ్రామం గుండా వెళ్తుండటంతో చాలా నష్టపోతున్నామని గట్టుదుద్దెనపల్లి సహకార అధ్యక్షుడు అనబేరి రాధకిషన్‌రావు, మాజీ సర్పంచ్ దేవసతీశ్‌రెడ్డి గోడు వెళ్లబోశారు. చాలా మంది ఇళ్లు కోల్పోయారని తెలిపారు. వెంటనే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

విద్యా సామగ్రి అందజేత



పుస్తకాలు, పలకలు అందజేస్తున్న అశోక్‌రెడ్డి

రామడుగు: మండంలోని వెలిచాల గ్రామ పరిధి గుడ్డివెలుగులపల్లి ఇటుక బట్టీ వద్ద ఉన్న విద్యార్థులకు జిల్లా సెక్టోరల్ అధికారి అశోక్‌రెడ్డి వర్క్ సైట్ స్కూల్ కార్యక్రమంలో భాగంగా గురువారం పుస్తకాలు, పలకలు, ఇతర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో అంబటి వేణుకుమార్, సీఆర్‌పీ అశోక్‌రెడ్డిలతో పాటుగా ఇటుక బట్టీల యాజమాని చెన్నకేశవులు, పలువురు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



చొప్పదండి: ఆలయ ఆవరణలో యాగశాల



పట్టాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

చొప్పదండి: మండలంలోని కోనేరుపల్లి గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ చెన్నమాధవుని పవనసుత రాజు ఆధ్వర్యంలో ప్రముఖ వేదపండితులు జగన్నాథం విష్ణువర్ధనాచార్యుల సమక్షంలో ఉత్సవాలు మొదలయ్యాయి. మొదటి రోజు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలు ఐదు రోజుల పాటు జరుగతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వెంకట లింగారెడ్డి, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ రాజు, కోశాధికారి బత్తిని ఎల్లగౌడ్, అశోక్, రామేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని రైల్వేస్టేషన్ ఆవరణలోని శ్రీరామాలయంలో వేదపడితులు వెంకటాచార్యులు, యజ్ఞాచార్యులు, నిఖిల్‌కుమారాచార్యులు గురువారం శ్రీరామ పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కూలీలకు నీడసౌకర్యం కల్పించాలి

కరీంనగర్‌రూరల్: ఉపాధిహామీ కూలీలకు సరైన నీడ సౌకర్యం కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని డీఆర్‌డీవో శ్రీధర్ ఆదేశించారు. గురువారం కరీంనగర్ మండలం చామనపల్లి, బహదూర్‌ఖాన్‌పేట గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. ఆయా నర్సరీల్లో పెంచుతున్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొక్కలు ఎండిపోకుండా ప్రతిరోజూ నీళ్లు పట్టాలని సూచించారు. అనంతరం ఉపాధికూలీలు పనిచేస్తున్న ప్రాంతాన్ని తనిఖీ చేశారు. కూలీలకు నీడ కోసం ఏర్పాటు చేసిన షెడ్‌నెట్‌ను పరిశీలించారు.షెడ్‌నెట్ చిన్నదిగా ఉందని, కూలీలందరికీ సరిపడే విధంగా ఏర్పాటు చేయాలని అన్నారు. వేసవిలో కూలీలు వడదెబ్బ బారిన పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీఆర్‌డీవో వెంట ఈజీఎస్ ఏపీవో శోభారాణి, పంచాయతీ కార్యదర్శులు ప్రభాకర్, లావణ్యలున్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముందయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com